స్వార్థమా? సంస్కారమా?

శ్రీ వల్లూరి గోపాల్ కృష్ణ

'సుబ్బారాయుడుగారూ?'

'ఎవరు?'

'ఉత్తరం ఇదిగోనండి'

బెజవాడనుంచి వచ్చింది. బెజవాడలో మాబంధువులెవరూ లేరు, సుధ తప్ప. సుధ నా సహపాఠి. సహపాఠి ఏమిటి? కాబోయే అర్ధాంగి. సుధ వ్రాస్తే నాపేరులేకుండా మానాన్నగారి పేరుతో ఎందుకు వ్రాస్తుంది? ఇది ఆమె వ్రాసింది కాదు. మరెవరో వ్రాసారని నిర్ధరించుకున్నాను. చింపి చదువుదామనే వుద్దేశ్యం బలవంతమై, మా నాన్నగారి అడ్రసుతోవున్న ఆవుత్తరాన్ని నాచేత చింపించి చదివించింది. ఉత్తరంచదివి శిలాప్రతిమనైపోయాను.

'వెనుకటి వైరాలు మర్చిపోండి. భార్యాభర్తల్ని విడదియ్యటం భావ్యంకాదు. ఒకరికి ఒకరు కాకుండా చేసినపాపాన్ని మాకు్కూడా పంచి ఇవ్వకండి—ముహూర్తానికి తమరు తప్పక అంగీకరిస్తారని తలుస్తున్నాను.'

ఇవీ ఆవుత్తరంలోని ముఖ్యసంగతులు. నాకు అంతా అర్థంఐంది. చిన్నప్పుడే నాకు పెళ్ళి జరిగిందన్నమాట. అరె! ఎంతమోసం.! అవును నాకు లీలగా స్ఫురిస్తోంది. పల్లకీ—ఆపిల్ల ఏడుపూ—నా అవ్యక్త ఆనందం—ఏదో కట్నంకానుకల విషయాల్లో తగాదావచ్చింది. అప్పణ్ణించీ ఎవరూ వారిమాట తలపెట్టడంలేదు. కాలచక్ర పరిభ్రమణంలో నేనూ ఆ వైవాహికం మర్చిపోయాను.

మా నాన్నగారు రావటంచూసి వుత్తరం దాచేసాను. 'అబ్బాయీ నీకో సంబంధం నిశ్చయం చేసాను. ఈ శెలవల్లోనే వివాహం చేసుకుందువుగాని.' నేను సాహసించాను. 'అదేమిటండీ నాకు చిన్నప్పుడే అయిందిగా పెళ్లి?' ఆయన నావంక అదోలాచూస్తూ 'నీ మొహం, చిన్నప్పుడు పెళ్ళేమిటి? ఏమన్నా మతి పెడదారిపడుతోందా?' 'అవును చిన్నప్పుడే పెళ్ళేమిటి?' బొమ్మలపెళ్లిగానీ! కానీ, జరిగిపోయినాక వాళ్లని మోసంచెయ్యటం భావ్యమా? సుధ నా ఎట్టఎదట భావవీధిలో నాట్యంచేస్తోంది నన్నాహ్వానిస్తూ. నేను పరపురుషుణ్ణని ఆమెకింకా తెలియదు కాబోలు. నాకుమాత్రం ఆమెదగ్గరకి వెళ్లటానికి బెదురుగానే వుంది.

'ఊ - ఏమిటి? ఈ శెలవల్లో?' మా నాన్నగారు నా భావాల్ని చెదరగొట్టారు.

'వీల్లేదండీ. నేను రేపే బయల్దేరి వెళ్లిపోవాలి. పరీక్షలు.'

'శెలవలైనాక పరీక్షలేమిటి?'

'ఇప్పుడంతే. రేపు తప్పకుండా నేను వెళ్లాలి. అదే మీతో చెప్పుదాం అనుకుంటున్నాను.' అప్రయత్నంగా ఈ బొంకు, ఎందుకో తెలీకండానే బొంకేసాను. మా నాన్నగారు దీర్ఘంగా ఆలోచించి ఇంట్లోకి వెళ్ళిపోయారు.

నేను తల రెండుచేతుల్తోనూ పట్టుకుని భావవీధిలోకి దిక్కూ మొక్కూ లేకండా ప్రవేశించాను.

'ఎందుకు అన్నానో అన్నాను నాన్నతో. రేపే బయల్దేరి వెళ్ళిపోవాలి.'

'ఎక్కడికి?'

'బెజవాడ.'—'సుధదగ్గరకా?' 'సుధ స్వప్న సుధే. ఆమెదగ్గరకి ఇక నేనెట్లా వెళ్లగలను? మా వెనకటి అత్తవారిల్లూ బెజవాడే కనుక అక్కడికి వెళ్దాం' అనుకున్నాను.

'ఎందుకూ'

'ఎందుకో నాకే తెలీదు. ఈ ఇంట్లో వుండటానికి వీల్లేదు కనుక.'

♦ ♦ ♦ ♦

నేనెక్కిన మెయిలుబండీకన్నా వేగంగా పరుగెడ్తోంది నా మనస్సు. నా హృదయంలో వెయ్యి రైళ్లూ, విమానాలూ, టాంకులూ, అనేకం ఒడుదుడుకుగా, దారీ తెన్నూ, హద్దూ ఆపూ, లేకండా ప్రయాణం చేస్తున్నాయి. వాట్ని దారిలో పెట్టటానికిగానీ, వాటి గమనాన్ని నిరోధించటానికిగానీ నా మనస్సుకి శక్తి లేకపోయింది. అట్లా ఎంతసేపని పరుగులెత్తుతాయి, తప్పదోవల్నిపడి? ఒక్కమాటు అన్నీ ఢీకొట్టుకుని మహాప్రళయాన్ని కలిగించాయి. ఆ ప్రళయానికి తట్టుకోలేకపోయాం, నేనూ, ప్రయాణీకులూ, మైలూ, అన్నీకూడా కలిసి ఒకేమారు బోల్తాకొట్టాం.

♦ ♦ ♦ ♦

రెండురోజుల అనంతరం బెజవాడ ఆస్పత్రిలో వున్నానని తెలుసుకోగలిగాను. నాకు అవయవ లోపం యేమీ జరుగలేదు గానీ, గుండెకిమాత్రం పెద్దదెబ్బ తగిలిందిట. చాలా నీరసంగా వుంది. ఇంతటి నీరసస్థితిలోనూ సుధా, చిన్నప్పటి బొమ్మలపెళ్లి పెళ్లామూ, ఇద్దరూ భావవీధిలో నాట్యంచేస్తూనే వున్నారు, ఈ సగం శరీరం ఎవరాక్రమించుకుంటారా అనే మీమాంసలో.

డాక్టరుగారు వచ్చారు నా మంచం దగ్గరకి.

'ఎలావుంది సార్?'

'తమ దయవల్ల మళ్లీ ప్రపంచంలో వున్నాననే సంగతి తెలుసుకోగలిగాను. బ్రతగ్గలననే ధైర్యం వుందా?'

'మరేం ఫరవాలేదు. మీదగ్గరవున్న టిక్కట్టు బెజవాడకి అని వుంది. బహుశా యీ వూళ్లో మీకు చుట్టాలు వుండవచ్చు. వారు ఎక్కడ వున్నారో చెబితే-'

సుధ ఇంటిఎడ్రసు చెప్పాను. మెయిలుబండి, బెజవాడ స్టేషనుకి అతి చేరువలోనే పట్టాలు తొలగింది. బండీ అట్టేవడిగా పోనప్పుడు ఈ ప్రమాదం జరిగింది కనుక అట్టే జననష్టం కలుగలేదని తెలిసింది.

నేను కలతనిద్రలో మూలుగుతున్నాను. చల్లగా నా నుదుటికి ఏదో స్పృశించింది. బహుశా, వుడుకు లాంగుడ్డేమో ననుకున్నాను. కాని ఆస్పర్శ కురుల్ని కూడా వెనక్కి సవరిస్తుంటే ఎవర్దో కరస్పర్శ అని కళ్లుతెరిచాను. సుధ! ఆతృతతోనూ ఆశ్చర్యంతోనూ కూడుకొని, నాతప్తహృదయానికి కొంచెం విశ్రాంతి నిచ్చే చల్లని ముఖపద్మం.

'సుధా' చాలా నీరసంగా పిల్చాను.

'ఎట్లావుంది?'

'కులాసాగానే వుందిగానీ నీకో ముఖ్య విషయం చెప్పాలి. చాలా పెద్దగాథ.'

'ఇప్పుడు మాట్లాడవద్దు. అలసట కలుగుతుంది.'

'మనస్సులో వుంచుకొని హృదయభారాన్ని వహించేకన్న నీతో చెప్పేస్తే-అలసట చెందితే మాత్రమేం, హృదయ భారం తీరుతుందిగా.'

సుధ నామాటకి ఎదురు చెప్పలేకపోయింది.

'సుధా. నాకు పెళ్ళయింది'

సంధిపట్టుకుందేమోనని కంగారుపడి నర్సుతో డాక్టర్ని పిల్చుకురమ్మని కబురుచేసింది.

'సుధా, నేను పూర్తిజ్ఞానంతో చెబుతున్నాను. నాకు ఏడవఏట పెళ్ళయింది. వారికీ మా నాన్న గారికీ కలిగిన మనస్పర్థలవల్ల రాకపోకలులేక నేను వారిమాట పూర్తిగా మరచిపోయాను. నా హృదయంలో నీకు చోటిచ్చాను. వారిదీ ఈవూరే. మొన్ననే నాకు ఇక్కణ్ణుంచి వుత్తరం వచ్చింది. అందుకనే బయల్దేరి వచ్చాను. విధి ఇలావుంది.'

నా mode of delivery ని బట్టి నేను పూర్తిగా తెలివితోనే ఈ సంగతంతా చెప్పానని సుధ నమ్మింది. ఆమెకీ ఏమీ తోచలేదు. నిశ్చేష్టతగా నా ముఖం వంక చూస్తూ కూర్చుండిపోయింది, ఊపన్నా వాల్చకుండా. అది నన్ను అమరలోకంలోకి ఆహ్వానిస్తోంది.

డాక్టరు వచ్చి నా నుదుటిమీద చెయ్యివేసి కంగారు పడ్డాడు. సుధకూడా చూచి నిలువునా కంపించిపోయింది.

'వాళ్ళకి కబురుచేసి పిలిపించు - గవర్నరుపేట' పేరూ మొదలైనవి చెప్పాను. ఆమె నౌకర్ను పంపివుండవచ్చు ననుకున్నాను, బయటికిపోయి వచ్చినందువల్ల.

డాక్టరు అన్నాడు 'అధైర్యపడకండి. ఇప్పుడు గుండె చాలా నీరసంగావుంది. ఇంజక్షన్ కూడా పని చెయ్యదు. ఓమాత్ర ఇస్తాను. దానితో ½ అరగంటలో గుణం కనిపిస్తుంది. లేకపోతే అప్పుడు మరోటి వేద్దాం. భగవంతుడి దయవుంటే——'

ఈ మాటలు నాకు చాలా హీన స్వరంతో చెప్తున్నట్లనిపించాయి.

రివ్వుమని పైకి ఎగిరిపోతున్నట్టనిపించింది. సుధ వెక్కి-వెక్కి ఏడుస్తోంది. ఎవర్నో తెలీకుండా, బ్రతిమాల్తున్నాను. 'ఒక్కమాటు క్రిందికిపోదాం' అని. కానీ నామాట ఎవరూ వినిపించుకునేట్టులేరు. ఊ-పైకి ఎగిరిపోవటమే వారిపని. అంత పైకి పోయినాక సుధ మాటలు వినిపించకపోవటమేకాక మనిషికూడా అదృశ్యం అవుతోంది. చేతగాని ఫొటోగ్రఫీలో ఒకబొమ్మకి వెయ్యిబొమ్మలు పడ్డట్టు సుధలోనుంచి అనేక మంది సుధలు బయల్దేరి నాపై ప్రవహిస్తున్నారు. కానీ, నా గమనం అందుకోలేక కాబోలు మధ్యలోనే అంతర్ధానం అయిపోతున్నారు. ఒక్కరూ నన్ను కలుసుకోలేదు.

అలికిడి వినిపించింది. పూర్వ రంగంలోకి ఎవరో చాలామంది వచ్చారు. వారిని చూట్టానికీ వాళ్ళతో మాట్లాట్టానికీ విమాన చోదకులకి ఇష్టంవుంది కాబోలు, మళ్ళీ క్రిందకు తీసుకువచ్చారు. ప్రతిమలు ఇదివరకన్నా కొంచెం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆలస్యం చెయ్యకుండా మూడేముక్కలు చెప్పేసి త్వరగా తెమల్చమని తొందరపెడ్తున్నారు.

'నా అవసానం ఇది. చిన్నప్పుడు మీ అమ్మాయిని పెళ్ళిచేసుకున్నానన్న సంగతి మొన్న మీరు వ్రాసిన వుత్తరంవల్ల తెలిసింది. అప్పుడు జరిగింది పెళ్లికాదని నా వుద్దేశ్యం. కనుక మీ అమ్మాయికి మంచి వరుడిని ఇచ్చి పెళ్ళిచేయండి!'

ఆయనేదో చెప్పబోయాడు. ఇంతలో ఎవరో మరొక యువకుడు రంగంలో ప్రవేశించాడు. అక్కడివారి భావాల్లో ఆ యువకుడి ఆగమనం కొంచెం మార్పుతెచ్చింది. ఆ యువకుడు కూడా వీరికి తెలీకండానే అక్కడికి ప్రవేశపెట్టబడ్డాడు కాబోలు. వీర్ని చూచి వెనక్కిపోబోయాడు. సుధే కాబోలు 'ఫరవా లేదు రండి' అంది. ఆయన వెళ్ళిపోవటానికి అవకాశం లేకపోయింది. రాధ (చిన్నప్పటి పెళ్ళిపెళ్ళాం) తలవంచుకుంది ఆ యువకుడ్ని చూసి. నాకు ఇది గ్రహించేశక్తి కూడా ఎవరో ఇచ్చారు అప్పుడే.. సంగతి తెలిసింది. అతడ్ని ఆమెని దగ్గరకి పిల్చాను. ఇద్దరిచేతులూ నాచేతుల్లోకి తీసుకున్నాను. మామగారి చేతులు అత్తగారి చేతులూకూడా కలిపి.

'ఇది శాశ్వతం చెయ్యండి. ఇదే నాకడసారి కోరిక. నామూలంగా ఒకప్రాణి నిర్భాగ్యం అవటం నా ఆత్మకి సంతృప్తి ఇవ్వదు.' కళ్లు మూసాను. చేతులు పట్లుదప్పాయి. రంయిమని విమానం ఎగిరిపోయింది తారాజువ్వలా. నామీద ఎవరో పడ్డట్టనిపించింది కాని నాకు ఈస్పర్శ తెలీలేదు. కొంతసేపటికి, ఊఁ, ఎగిరిపోవటమే పైకి.

సుధ తన అమృతభరితమైన ముఖపద్మంలోంచి నామీద జీవసుధ జల్లింది. బహుశా ఆ విమానంలోంచి పారాచూట్ సహాయంతో అమాంతం దూకివుంటాను. అందుకనే నా గుండెలమీద పడుకుని నాముఖాన్ని రెండు చేతుల్తోనూ పట్టుకుని తదేకధ్యానంతో నా ముఖంవంక చూస్తున్న సుధామూర్తి మళ్లీ నాకు కనుపించటం.

నా కనురెప్పలు తొలగిపోయాయి. 'నీ అర్ధాంగిని చూడు, ఎంత ఆత్రుతగావుందో! ఆమెని వదలి నువ్వు ఒక్కడివీ పోతావా? ఎంత అమర ఆహ్వానం అయితేమాత్రం!' అని హెచ్చరించాయి. 'తలత్రిప్పి నీ చుట్టుచూడు, ఎంతమంది కనిపెట్టుకుని వున్నారో! వారంతా నీ అర్ధాంగి పడే ఆవేదనలో ఎన్నోవంతైనా పడుతున్నారా?' అన్నాయి.

అంతా కలకలారవంతో నిండిపోయింది. డాక్టరు నామీద చెయ్యివేసి సంతోషంగా కేకవేసాడు. 'బలే అదృష్టవంతులండీ. ఆనాడు సావిత్రీదేవి భర్తని బ్రతికించుకుందట. అది మనం వింటమేగాని చూళ్ళేదు. ఈవాళ ఈమె' ఇక మాట్లాడలేక పోయాడు.

సుధమనస్సు ఆనందతరంగ డోలికల్లో ఊగులాడిపోయింది. ఆమె నామీదనుంచి ప్రక్కగా కూర్చుంది.

సుధకీ నాకూ జరిగిన వివాహంతో బాటే రాధాకృష్ణుల వివాహంకూడా జరిగింది. (నాచిన్నప్ప పెళ్లామూ, ఆమె ప్రియుడూ అన్నమాట.)

మానాన్నగారు ముందు భీష్మించుక్కూర్చున్నా (నామొహం చూడనని) సుధ నాన్నగారికి చాల ఆస్తివుందనీ, కొడుకుల్లేరనీ తెలుసుకుని అదంతా మనకే వస్తుంది కదా అనే సంతృప్తితో చివరకి వివాహ సమయానికి చేరుకున్నారు. ఇంతకీ వివాహం సలక్షణంగా జరిగిపోయింది.

మా ముఖ్యఅతిథి డాక్టరుగారు. వారికి నమస్కరించాం దంపతులం. 'Very dramatic Mr. Murty అన్నారు అతిసంతోషంగా. మా గోపాలం 'very lucky fellow—Two birds at one shot అంటే ఇ అసలు. సంస్కారంతోబాటు స్వార్థంకూడా నెరవేరింది' అన్నాడు. మానాన్నగారు వివాహవైభవాని వారి ఆస్తికీ సంతృప్తిపడిరి.

'ఆ భగవంతుని దయ' అన్నారు. మా మామగారు తనకొమార్తె చదువుకున్నందుకు తగిన ఆదర వివాహం చేసుకుందని సంతృప్తిచెందారు.

జగదుద్యానము

శ్రీపాద లక్ష్మీనారాయణమూ

మొక్కలను నాటి తగునీరు పోసి పెంచి
వివిధ జాతి పుష్పములకై వేచియుండ
కొన్ని మొక్కలు పుష్పించకుండ తలగు
కొన్ని యొసగును రంగు రంగుల విరులను.

అందులో కొన్ని పూలభాగ్యంబదేమొ
నిండు భక్తుల పూజా కరండకముల
జేరి దేవాలయద్వార సీమ దాటి
పడయు నీశ్వర సాన్నిధ్య వైభవంబు.

ఇంక మరికొన్ని పూలు రాకేందు ముఖుల
శిరసుల నలంకరించి తద్వరుల హృదయ
ధనముల హరించి ప్రణయైక ధామములయి
సౌఖ్య రసవార్ధిఁ దేలించు సతులఁ బతుల.

కొన్ని పూలెట్టి త్యాగంపు గుణము గలవొ
భృంగ పంక్తికిఁ దేనెలఁబెట్టి తనువు
పాంథలోకమునకు మంచి పరిమళంబు
అవిరళంబుగ వెదజల్లి అలరఁజేయు.

కాని మరికొన్నిపూల యోగంబదేమొ
ఎవ్విధంబుననైన తరించలేక
భూమిపై నెట్లుపుట్టెనో, భూమిపైన
తిరిగి యారీతి రాలి గతించు నకట.

ఇట్టులే ధారుణీస్థలిఁ బుట్టు నరులు
కొందరీశ్వర సాన్నిధ్య మందగలరు
కొందరున్నత పదవుల పొందగలరు
కొందరు నిరర్థకంబుగా కుందుచుంద్రు.